వెండిని కరిగించి గుమ్మరిస్తున్నట్టుగా వుంది తలకోన జలపాతం. రక్తంలో స్నానం చేసినట్టున్న సూర్యుడు మెల్లిగా కొండల్లోకి జారిపోతున్నాడు. వెలుతురులో సాంద్రత తగ్గిపోతూ వుంది. మిగిలిన ఒకరిద్దరు యాత్రీకులు కూడా బట్టలు సర్దుకుని వెళ్లిపోయారు. చీకటిపడేవేళ జలపాతం దగ్గరికి వస్తున్న నన్ను చూసి ఆశ్చర్యంగా మొహం పెట్టి ఏదో అడగబోయారు. నేను వినిపించుకోలేదు.

జలపాతం నన్ను సూదంటురాయిలా లాక్కుంటూ వుంది. పైనుంచి వురికురికి వస్తూ కొండరాళ్లకు ఢీకొని ముక్కలైపోతూవుంది. గుండెలు బాదుకుంటూ రోదిస్తూవుంది.

# ఒకానొక జలపాతం

జి.ఆర్. మహర్షి



నరమానవుడు తోడు లేకుండా ఒంటరిగా చూస్తేనే ఈ జలపాతం అందం, బీభత్సం తెలిసేది! ఈ హోరు కొన్ని సార్లు భయపెడుతుంది, గిలిగింతలు పెడుతుంది, జలదరింప చేస్తుంది.

సాయంత్రం నుంచి చీకటిలోకి ప్రకృతి పరావర్తనం చెందుతోంది. రకరకాల పక్షుల అరుపులు వినిపిస్తున్నాయి. లేతనీలపు రంగులో వున్న వాతావరణం మెల్లిగా రూపుని కోల్పోతూవుంది. జలపాతం దగ్గరికి వెళ్లాను. కాస్త దూరంలో వుండగానే తన చేతుల్ని చాచి చల్లగా తడిమింది. వెళ్లి

పెనవేసుకున్నాను. ఒళ్ళంతా ఇష్టమొచ్చినట్టు తపతపకొట్టింది. వానా కాలాన్నంతా తాగేసి బాగా బలిసివుంది. చేతికి చిక్కడం లేదు. తడిసి తడిసి ముద్దవుతుంటే, చుట్టూ పాములా పాకుతున్న చీకటిని కూడా గమనించ లేదు. గెస్ట్‌హౌస్‌కి చేరుకోవాలంటే గంట పాటు నడవాలి. చీకట్లో కూడా ఈ దారిని కనుక్కోగలను.

వున్నట్టుండి ఏదో విచిత్రమైన శబ్దం వినిపించింది. అది జంతువో పక్షో అర్థం కాలేదు. అడవితో ఎంత పరిచయమున్నా అడవి గొంతులో కదిలే చాలా రకాల శబ్దాలు నాకే తెలియవు. మనకు కనబడని, వినబడని వేరే ప్రపంచం అడవిలో వుంటుంది.

జలపాతం హోరులోనే చెవులు రిక్కించాను. మసక చీకటిలో ఎవరో వస్తున్నట్టుంది. మొలలోని పిడిబాకుని చేతిలోకి తీసుకుని జలపాతం ఈవలకు వచ్చాను. బట్టలన్నీ తడిసిపోయున్నాయి. రివాల్వర్ తడిసిపోకూడదని ఒక రాయిమీద పెట్టాను. వెళ్లి దాన్ని అందుకున్నాను.

అడుగుల శబ్దం దగ్గరయ్యింది. చీకట్లోంచి ఒక మనిషి నా ముందుకొచ్చాడు. ఫుల్ హ్యాండ్స్ చొక్కా, ప్యాంటు వేసుకున్నట్టు తెలుస్తోంది.

'' ఎవరునువ్వు?'' అని గట్టిగా గద్దిస్తూ రివాల్వర్ చేతిలోకి తీసుకున్నాను.

అవతలి మనిషి కంగారుపడి ''సార్ ఇక్కడికి దగ్గరలోనే వున్న నెరబైలు మావూరు. స్నానానికని వచ్చాను. కాని ఇంత తొందరగా చీకటిపడుతుందనుకోలేదు. దూరం నుంచే మిమ్మల్ని చూసాను. వెనక్కి వెళ్లడానికి తోడుగా వుంటారని ....'' అన్నాడు.

''సరే పద'' అన్నాను. చేతిలో రివాల్వర్ మొలలో బాకు భద్రంగా వున్నాయి. ఈ కొత్తమనిషితో నాకేదైనా ప్రమాదమొస్తే ఆదుకుంటాయి. అయినా అతను బలహీనంగా వున్నాడు. నన్నేం చేయగలడు? నా దగ్గర రివాల్వర్ తప్ప విలువైన వస్తువులేమీ లేవు. రకరకాలుగా సాగుతున్నాయి నా ఆలోచనలు.

బట్టలతోనే స్నానం చేయడంతో తడిసిన బట్టల్లోకి గాలి దూరి చలి పుట్టిస్తూవుంది.

''స్నానానికి వెళతావా?'' అన్నాను.

''లేదు సార్, చీకటిపడింది వెళ్లిపోదాం. అడవిలో తోడేళ్ల గుంపు వుంది'' అతని కళ్లలో సన్నటి మెరుపు.


ఇద్దరం బయలుదేరాం. అడవిలో నడకవేగంగా సాగుతూవుంది. అతని వయసు ముప్పయి, నలభై మధ్య వుంటుంది. మొహం సరిగ్గా కనిపించడం లేదు. జంతువుల అరుపులు పెరిగి పెద్దవవుతున్నాయి. చీకటి మందంగా మారుతోంది. గాలి ఆయాసంగా బుస కొడుతూ వుంది.

''నీపేరేమిటి?'' అని అడిగాను.

''చంద్రుడు''

''ఏం జేస్తుంటావ్?''

''ఒకప్పుడు రైల్వే పోలీసుని, ఇష్టం లేక ఉద్యోగం మానేసాను. కొంచెం పొలముంది. దాంతోనే జీవనం. అడవిలో తిరుగుతూ మొక్కలూ, పక్షులూ, జంతువులూ వీటిని గమనిస్తూ వుండడం అలవాటు. ఒకసారి ఈ జీవితానికి అలవాటుపడితే మార్చుకోలేం'' అన్నాడు.



ఇద్దరం వేగంగా నడుస్తున్నాం. ఆకాశమంతటా చుక్కలు మెలుస్తున్నాయి. నడకలో వేగం వల్ల ఆయాసం పెరుగుతోంది. అతను గసపోస్తున్నాడు. కాని అది ఇంకో విధంగా వుంది. పరిగెత్తుతున్నప్పుడు కుక్కలు అలాంటి శబ్దం చేస్తుంటాయి.

తలకోన లైట్లు కనిపిస్తున్నాయి. వూరు చాలా చిన్నది. అడవి ప్రాంతం కాబట్టి అక్కడ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవాళ్లు మాత్రం నివాసం వుంటారు. చాలా మంది సాయంత్రానికి వెళ్లిపోతారు. వూరినుంచి ఒక కిలోమీటరు దూరంలో గెస్ట్‌హౌస్ వుంది. అక్కడ నేను గది తీసుకున్నాను.

''మీరేం జేస్తారు సార్?'' అని చంద్రుడు అడిగాడు.

''తిరుపతిలో నాకు వ్యాపారాలున్నాయి. అడవంటే చాలా ఇష్టం. అందుకే అప్పుడప్పుడు ఇట్లా వస్తుంటాను.''

''రివాల్వర్ ఎందుకు సార్? వేటాడ్డానికా?''

''ఎప్పుడైనా వేటాడుతుంటాను''

''తోడేళ్లని కూడా వేటాడుతారా?''

నాకు కోపం వచ్చింది. ''పదే పదే తోడేలు గురించి ఎందుకు మాట్లాడుతావ్?'' అన్నాను.

చంద్రుడు నవ్వి ''తోడేలంటే నాకిష్టం'' అన్నాడు.

నేను ఆశ్చర్యపోయాను. తోడేలంటే ఇష్టపడేవాన్ని ఇంతవరకూ నేను చూడలేదు.

''దానికో కతుందిసార్. ఈ రాత్రికి మావూరు వెళ్లాలంటే కష్టం. మీతో వుండనిస్తారా?'' అని అడిగాడు చంద్రుడు.

ఆ కథ వినడానికైనా అతన్ని తీసుకెళ్లక తప్పేలా లేదు ''సరే రా'' అన్నాను.

''కథ చెప్పుమరి'' అన్నాను.

''గసగా వుంది కాసేపాగండి సార్!'' అన్నాడు.

గెస్ట్‌హౌస్ చేరుకున్నాం. కలపతో కట్టిన గెస్ట్ హౌస్. వాచ్‌మన్ కోసం కేకేశాను. లేడు. వూళ్లోకి వెళ్లుంటాడు.

రూం తెరిచేసరికి క్యారియర్ రెడీగా వుంది. ఆకలి దంచేస్తూవుంది. క్యారియర్ తీసాను. చికెన్ భోజనం.

వరండాలో కుర్చీలు వేసుకుని కూర్చున్నాం. మందు బాటిల్ తీసి చంద్రుడికో పెగ్గుపోసి ''ఇప్పుడు చెప్పు నీ తోడేలు కథ'' అన్నాను.

చంద్రుడు మొదలుపెట్టాడు.

''నేను రైల్వే పోలీసుగా చేరిన కొత్త రోజులవి. పోలీసంటే పోలీసే. సివిలైనా, రైల్వే అయినా ఒకటే. ఎప్పుడూ తిట్టించుకుంటూ అయినా వుండాలి. లేదా ఎవన్నో ఒకన్ని తిడుతూ అయినా వుండాలి. ఒకరోజు మధ్యాహ్నం ఇన్ఫర్మేషనొచ్చింది. అడవిలో రైలు కింద పడి ఎవడో చచ్చాడని. రైల్వే ట్రాక్‌మీద పడి చస్తే, వాడి శవాన్ని కాపలా కాయాల్సింది రైల్వే పోలీసే. మెసేజ్ వచ్చిన తరువాత వెళ్లాల్సిందే. లేదంటే ఆ శవాన్ని నక్కలో తోడేళ్లు పీక్కు తింటాయి. నేను మా హెడ్ కానిస్టేబుల్ బయలుదేరాం.




సాయంత్రానికి ఆ దరిదాపుల్లో వున్న స్టేషన్ చేరాం. అక్కడినుంచి మూడు కిలోమీటర్లు అడవిలో నడిచి ఆ శవం దగ్గరకిచేరాం. శవం రెండు ముక్కలై పోయింది. మధ్యాహ్నం పడిచచ్చాడు.

వీడికి చావడానికి ఈ అడవే దొరికిందాని తిట్టుకుంటూ ఒక గోనెసంచిలో శవం రెండు ముక్కల్ని పెట్టుకున్నాం. అప్పటికే చీకటి పడుతూవుంది. శవాన్ని కాస్త దూరంలో చెట్టుకిందకి చేర్చాం. అక్కడనుంచి స్టేషన్‌కి చేరాలంటే అంత సులభం కాదు. శవం చాలా బరువుగా వుంటుంది. ఇద్దరు మనుషులం అంతదూరం మోయలేం. ఇద్దరం పర్సనాలిటీ తక్కువవాళ్లమే.

కాసేపటి తరువాత మా హెడ్డు సారాయి తాగడానికి దూరంగా కనిపించే పల్లెవైపు వెళ్లాడు. అది కనీసం నాలుగు కిలోమీటర్లుంటుంది. సారాయి కోసం అతను ఎంతదూరమైనా పోతాడు.

ఇక మిగిలింది నేనూ... శవం. నా భుజానికి తుపాకీ వేలాడుతూవుంది. శవానికి కాపలాకూర్చున్నాను. మా హెడ్డు తిరిగొస్తాడని నమ్మకం లేదు. చీకట్లో ఏవేవో ఆకారాలు తిరుగుతున్నట్టు కనిపిస్తూ వుంది. పిచ్చి పిచ్చిఅరుపులు వినిపిస్తున్నాయి.

శవమున్న గోనెసంచిలోంచి చచ్చినవాడు బయటకొచ్చి పీక్కుతింటాడేమోనని భయమేసింది. కాసేపటికి ఎవరో ఆయాసంతో బుసకొడుతున్న శబ్దం 'స్‌స్‌స్' అని వినిపించింది. నల్లటి చీకటిలో ఏవో కళ్లు మెరుస్తున్నాయి.

అవి తోడేళ్లు, శవం కోసం వచ్చాయని అర్థమైంది. తుపాకీ చేతిలోకి తీసుకుని గట్టిగా కేకపెట్టాను. నా కేకకు నేనే భయపడ్డాను. ఆ తోడేళ్లు మొత్తం ఎన్ని వున్నాయో తెలియదు. బెదురుకుని కొంచెం దూరం పారిపోయాయి.

కొన్ని క్షణాల తరువాత మళ్లీ వచ్చాయి. ఈ సారి ఒక వ్యూహంతో చుట్టూ కమ్ముకున్నాయి. ట్రిగ్గర్ మీద వేలుపెట్టాను. గురి తప్పితే బుల్లెట్ వేస్ట్ అయినందుకు కూడా సమాధానం చెప్పాల్సి వుంటుంది. ఆ తోడేళ్లు నన్ను చంపేస్తాయని భయపడ్డాను. అక్కడ్నుంచి పారిపోయినా వెంటబడి చంపేస్తాయి. ఎదుర్కొంటేనే తక్కువ ప్రమాదం.

ట్రిగ్గర్ మీది వేలు బిగుసుకుంది. చుట్టూ వున్న కళ్లు మెరుస్తున్నాయి. శక్తినంతా వేళ్లలోకి తెచ్చుకుని నొక్కాను.

ఆశ్చర్యం ఎలాంటి శబ్దం రాలేదు. తుపాకీ పేలలేదు. ఇంతలో ఒక తోడేలు నావైపు దూకింది.

చెబుతూ అతను ఆగాడు.

''తర్వాత ఏమైంది చెప్పు'' టెన్షన్ తట్టుకోలేక అడిగాను. చంద్రుడు మౌనంగా వున్నాడు.

ఇంతలో వున్నట్టుండి కరెంట్‌పోయింది. అప్పుడు గుర్తొచ్చింది ఆ రోజు అమావాస్య.

అగ్గిపెట్టె తీసి వెలిగించాను.

పసుపు రంగు వెలుతురులో చంద్రుడు చేతివైపు చూశాను. ఒక్కక్షణం ఒళ్లంతా భయం వ్యాపించింది. ఆ చేతికి పొడుగాటి గోళ్లున్నాయి. జంతువులకు మల్లే బొచ్చువుంది. చెయ్యి వణికింది. అగ్గిపుల్ల ఆరిపోయింది.

చీకట్లో చంద్రుడి కళ్లు మెరుస్తున్నాయి.

''కథ వినాలని లేదా'' చంద్రుడి గొంతు గురగురమంటోంది.

చలిగాలిలో కూడా చెమట్లు పడుతున్నాయి నాకు.

అతికష్టం మీద అగ్గిపుల్ల వెలిగించాను.

చంద్రుడికి బదులు నాముందు ఒక తోడేలు కూచుని వుంది.